రోహిత్‌కు విశ్రాంతి

తుది జట్టు ఎంపికపై బుమ్రా వివరణ

సిడ్నీ: అందరూ ఊహించినట్లుగానే భారత రెగ్యులర్ కెప్టెన్ రోహిత్‌శర్మకు ఆస్ట్రేలియాతో సిడ్నీ టెస్టులో చోటు దక్కలేదు. ఆయా వార్తా సంస్థల కథనాలకు బలం చేకూరుస్తూ మ్యాచ్‌కు ముందు బీసీసీఐ విడుదల చేసిన 15 మందితో కూడిన జట్టులో రోహిత్ పేరు లేదు. దీంతో చీఫ్ కోచ్ గౌతం గంభీర్.. రోహిత్‌పై వేటు వేశాడని, అతని కెరీర్ ఇక ముగిసినట్లేనని అభిప్రాయాలు వెల్లువెత్తాయి. దీనికి మరింత బలాన్ని జోడిస్తూ హిట్‌మ్యాన్ స్థానంలో కెప్టెన్ బుమ్రా..కమిన్స్‌తో కలిసి టాస్‌కు వచ్చాడు. ఆ తర్వాత వ్యాఖ్యాత రవి శాస్త్రితో బుమ్రా మాట్లాడుతూ 'రోహిత్ ఈ మ్యాచ్ నుంచి విశ్రాంతి తీసుకుని నాయకత్వ స్ఫూర్తిని కనబరిచాడు. మా జట్టులో ఐకమత్యాన్ని ఇది సూచిస్తుంది. జట్టులో ఎవరికి ఎలాంటి స్వార్థం లేదు. జట్టుకు ఏది లాభమో అదే చేయాలని ఆలోచించాం. అందుకు తగ్గట్లుగా టీమ్ మేనేజ్‌మెంట్ నిర్ణయం తీసుకుంది'అని బుమ్రా పేర్కొన్నాడు. అయితే మ్యాచ్ ముగిసిన తర్వాత పంత్ మాట్లాడుతూ 'రోహిత్ జట్టులో లేకపోవడం భావోద్వేగ సందర్భం. ఇది మేనేజ్‌మెంట్ తీసుకున్న నిర్ణయం. ఈ చర్చల్లో నేను లేను కాబట్టి ఇంత కన్నా ఎక్కువ మాట్లాడలేను' అని అన్నాడు. ఇదిలా ఉంటే ఈ సిరీస్‌లో పేలవ ప్రదర్శన కనబరిచిన రోహిత్ 14 మ్యాచ్‌ల్లో 24 సగటుతో 619 పరుగులు చేశాడు. ప్రస్తుతమున్న పరిస్థితుల్లో హిట్‌మ్యాన్ టెస్టు కెరీర్ ముగిసినట్లేనని వార్తలు వినిపిస్తున్నాయి. ఇంగ్లండ్‌తో సిరీస్ వరకు టెస్టులు లేకపోవడం దీనికి కారణం కాగా, చాంపియన్స్ ట్రోఫీ కోసం రోహిత్‌కు బదులు వన్డే కెప్టెన్‌గా హార్దిక్ పాండ్యాను నియమించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తున్నది. ఇదే జరిగితే రోహిత్ అంతర్జాతీయ కెరీర్‌కు దాదాపు ఫుల్‌స్టాప్ పడ్డట్లే.

క్రికెట్ అభివృద్ధికి సహకరించండి

- టీడీసీఏ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్, ఆట ప్రతినిధి: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కల్గిన క్రికెటర్ల అభివృద్ధికి సహకరించాలని తెలంగాణ డిస్ట్రిక్స్ క్రికెట్ అసోసియేషన్(టీడీసీఏ) చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. టీడీసీఏకు బీసీసీఐ గుర్తింపు నివ్వాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అమెరికా క్రికెట్ బోర్డు చైర్మన్ వేణు రెడ్డిని సాట్స్ చైర్మన్ శివాసేనారెడ్డితో కలిసి టీడీసీఏ ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా టీడీసీఏ 2025 క్యాలెండర్‌తో పాటు అండర్-16 టోర్నీ ట్రోఫీలను ఆవిష్కరించారు. తెలంగాణ బిడ్డ అగ్రరాజ్యం అమెరికా క్రికెట్ బోర్డు చైర్మన్ కావడం సంతోషంగా ఉందని శివసేనారెడ్డి పేర్కొన్నారు. 'అమెరికాలో క్రికెట్‌ను ఐసీసీ గత ఐదేండ్ల కాలంలోనే గుర్తించింది. నేను చైర్మన్‌గా ఉన్న సమయంలోనే టీ20 ప్రపంచకప్‌నకు అమెరికా ఆతిథ్యమివ్వటం, అండర్-19 వరల్డ్‌కప్ టోర్నీకి అర్హత సాధించింది. తెలంగాణలో గ్రామీణ క్రికెట్ పురోగతి సాధించాలి' అని వేణురెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జేఫ్ చైర్మన్ రామిరెడ్డి, పెటా అధ్యక్షుడు రాఘవ రెడ్డి, సురేందర్‌రెడ్డి, టీడీసీఏ జిల్లా కన్వీనర్లు, క్రికెటర్లు తదితరులు పాల్గొన్నారు.

ఖో ఖో ప్రపంచకప్ ట్రోఫీ, మస్కట్స్ విడుదల

ఆవిష్కరించిన జాతీయ ఖోఖో ఫెడరేషన్

న్యూఢిల్లీ: భారత్ వేదికగా ఈనెల 13 నుంచి మొదలుకాబోతున్న అరంగేట్రం ఖో ఖో ప్రపంచకప్ కోసం ట్రోఫీతో పాటు మస్కట్స్ తేజస్, తారను జాతీయ ఖోఖో అసోసియేషన్(కేకేఎఫ్ఐ) ఆధ్వర్యంలో విడుదల చేశారు. భారత క్రీడా ప్రాధికార సంస్థ(సాయ్) ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో ఖోఖో ప్రపంచకప్ పోటీలు జరుగనున్నాయి. తొలిసారి జరుగబోతున్న ఈ టోర్నీలో ఆరు ఖండాలలోని 24 దేశాల నుంచి 21 పురుషుల, 20 మహిళల జట్లు బరిలో ఉన్నాయి. పురుషుల చాంపియన్‌షిప్ కోసం నీలిరంగు ట్రోఫీ, మహిళల ఈవెంట్ కోసం గ్రీన్ ట్రోఫీలను ఆవిష్కరించారు. మరోవైపు టోర్నీ అధికారిక మస్కట్‌లుగా 'తేజస్', 'తార'ను ఫెడరేషన్ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ మస్కట్‌లు వేగం, చురుకుదనం..జట్టు కృషి వంటి ప్రధాన లక్షణాలు కల్గి ఉంటాయి. భారత సంప్రదాయ క్రీడ యొక్క వారసత్వాన్ని ప్రతిబింబించేలా వీటిని రూపొందించారు.

బ్యాటింగ్ బేజారు

భారత్ తొలి ఇన్నింగ్స్ 185 ఆలౌట్ • మళ్లీ విఫలమైన విరాట్ కోహ్లీ • రిషబ్ పంత్ ఒంటరి పోరాటం

కోహ్లీ (17)

పంత్ (40)

బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ(బీజీటీ) సిరీస్‌లో భారత బ్యాటింగ్ పేలవ ప్రదర్శన పతాక స్థాయికి చేరుకుంది. ఇప్పటికే తీవ్ర ఒడిదొడుకులు ఎదుర్కొంటున్న టీమ్‌ఇండియా సిడ్నీ టెస్టులో మళ్లీ అదే సీన్ పునరావృతం చేసింది. ఆస్ట్రేలియా పేసర్ల ముప్పేట బౌలింగ్ ధాటికి మన బ్యాటింగ్ పేకమేడను తలపించింది. పచ్చికతో కళ కళ లాడుతున్న పిచ్‌పై బోలాండ్, స్టార్క్, కమిన్స్ సూపర్ స్వింగ్‌తో వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. ఫామ్‌లేమితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విరాట్ కోహ్లీ.. బోలాండ్ బౌలింగ్‌కు మరోమారు బలయ్యాడు. ఔట్‌సైడ్ ఆఫ్‌స్టంప్ బలహీనతకు గురవుతూ కోహ్లీ వికెట్ సమర్పించుకున్నాడు. టాపార్డర్ ఘోరంగా విఫలం కాగా, మిడిల్‌లో రిషబ్ పంత్, జడేజా పోరాట పటిమ కనబరిచారు. ఆసీస్ బౌలింగ్ ధాటికి పలుమార్లు గాయాలపాలైన పంత్ టాప్‌స్కోరర్‌గా నిలువగా, మెల్‌బోర్న్ సెంచరీ హీరో నితీశ్ గోల్డెన్ డక్‌గా వెనుదిరుగడంతో 185 పరుగులకే కుప్పకూలింది. తొలి ఇన్నింగ్స్‌కు దిగిన ఆసీస్..ఖవాజ వికెట్ కోల్పోయి 9 పరుగులు చేసింది. తుది జట్టులో చోటు దక్కించుకోలేకపోయిన రెగ్యులర్ కెప్టెన్ రోహిత్‌శర్మ డగౌట్‌లో ముభావంగా కూర్చోవడం అభిమానులను నిరాశకు గురిచేసింది.

సిడ్నీ: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ(బీజీటీ) సిరీస్‌లో సిడ్నీ పోరుకు శుక్రవారం తెరలేచింది. రోహిత్‌శర్మ స్థానంలో తాత్కాలిక కెప్టెన్‌గా వచ్చిన బుమ్రా..టాస్ గెలిచిన వెంటనే మరో ఆలోచన లేకుండానే బ్యాటింగ్ ఎంచుకున్నాడు. ఇదే అదనుగా వాతావరణ పరిస్థితులను అంచనా వేసుకుంటూ ఆస్ట్రేలియా పేసర్లు ఆది నుంచే భారత్‌పై మెరుపుదాడికి దిగారు. పచ్చికతో ఉన్న పిచ్‌పై స్వింగ్ రాబడుతూ టీమ్ ఇండియాను కోలుకోలేని దెబ్బతీశారు. స్కాట్ బోలాండ్(4-31), స్టార్క్(3-49), కమిన్స్(2-37)..టీమ్‌ఇండియా పతనంలో కీలకమయ్యారు. రిషబ్ పంత్(98 బంతుల్లో 40, 3ఫోర్లు, సిక్స్) టాప్‌స్కోరర్‌గా నిలువగా, జడేజా(95 బంతుల్లో 26, 3ఫోర్లు) ఆకట్టుకున్నాడు. ఆ తర్వాత మొదటి ఇన్నింగ్స్‌కు దిగిన ఆసీస్ ఆట ముగిసే సరికి ఓపెనర్ ఖవాజ(2) వికెట్ కోల్పోయి 9 పరుగులు చేసింది. చేతిలో 9 వికెట్లు ఉన్న ఆసీస్ ప్రస్తుతం 176 పరుగుల వెనుకంజలో ఉన్నది. కెప్టెన్ బుమ్రా(1-7) ఒక వికెట్ తీశాడు.

పంత్, జడేజా పోరాటం:

రోహిత్ స్థానంలో జట్టు పగ్గాలు అందుకున్న బుమ్రా బ్యాటింగ్ వైపు మొగ్గుచూపాడు. కెప్టెన్ నమ్మకాన్ని నిలబెట్టడంలో బ్యాటర్లు ఘోరంగా విఫలమయ్యారు. సిరీస్‌లో ఒకింత నిలకడైన ప్రదర్శన కనబరుస్తున్న కేఎల్ రాహుల్(4) నిరాశపరిచాడు. తన వికెట్ విలువను గుర్తు ఎరుగకుండా స్టార్క్ బౌలింగ్‌లో కాన్‌స్టాస్‌కు క్యాచ్ ఇచ్చి మొదటి వికెట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత రాహుల్‌ను అనుసరిస్తూ జైస్వాల్(10) రెండో వికెట్‌గా ఔటయ్యాడు. బోలాండ్ బౌలింగ్‌లో అరంగేట్రం ప్లేయర్ వెబ్‌స్టర్ క్యాచ్‌తో ఔటయ్యాడు. దీంతో 17 పరుగులకే టీమ్‌ఇండియా ఓపెనర్ల వికెట్లు కోల్పోయింది. రోహిత్‌కు బదులుగా జట్టులోకి వచ్చిన గిల్(20) నిలదొక్కుకునే ప్రయత్నం చేశాడు. ఆసీస్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ రెండు ఫోర్లతో ఆకట్టుకున్నాడు. కుదురుగా సాగుతున్న ఇన్నింగ్స్‌లో గిల్ ఔట్ రూపంలో కుదుపు ఏర్పడింది. లంచ్‌కు ముందు లియాన్ బౌలింగ్‌లో షాట్ ఆడబోయిన గిల్..స్లిప్‌లో స్మిత్‌కు క్యాచ్ ఇచ్చాడు. ఆ తర్వాత విరాట్‌కోహ్లీ(69 బంతుల్లో 17) వంతైంది. సిరీస్‌లో తన బలహీనతను మరోమారు బయపెట్టుకుంటూ బోలాండ్ వేసిన స్వింగర్‌ను ఆడే ప్రయత్నంలో కోహ్లీ క్యాచ్ ఔటయ్యాడు. పెర్త్ టెస్టులో సెంచరీ మినహా పెద్దగా చెప్పుకోలేని స్కోర్లు చేసిన కోహ్లీ వికెట్‌కు ఉన్న విలువను గుర్తించలేకపోయాడు. ఈ తరుణంలో పంత్ అద్భుతమైన పోరాటపటిమ కనబరిచాడు. అప్పటికే 72 పరుగులకే 4 కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో ఉన్న జట్టును పంత్ ఒడ్డున పడేసే ప్రయత్నం చేశాడు. ఓవైపు ఆసీస్ బౌలింగ్ ధాటికి కాచుకుంటూ పలుమార్లు గాయపడ్డాడు. పంత్ చివరికి బోలాండ్‌కు వికెట్ ఇచ్చుకున్నాడు. దీంతో జడేజాతో ఐదో వికెట్‌కు 48 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. మరుసటి బంతికే నితీశ్‌కుమార్(0) కూడా ఔట్ కావడంతో టీమ్‌ఇండియా కోలుకోలేకపోయింది. ఆఖర్లో బుమ్రా(22) బ్యాటు ఝుళిపించినా లాభం లేకపోయింది.

బుమ్రా ఖాతాలో ఖవాజ:

బీజీటీ సిరీస్‌లో ఖవాజ మరోమారు..బుమ్రా చేతికే చిక్కాడు. తొలి ఇన్నింగ్స్‌కు దిగిన ఆసీస్ ఆట ముగిసే సరికి వికెట్ నష్టానికి 9 పరుగులు చేసింది. బుమ్రా స్వింగ్‌కు తొలించిన ఖవాజ..స్లిప్‌లో రాహుల్ క్యాచ్‌తో ఔటయ్యాడు. దీంతో ఈ సిరీస్‌లో ఆరోసారి బుమ్రా బౌలింగ్‌లో ఖవాజ ఔటైనట్లు అయ్యింది. మరో ఎండ్‌లో కాన్‌స్టాస్(7) దూకుడుగా కనిపించాడు. కవ్వించే ప్రయత్నం చేసిన కాన్‌స్టాస్‌ను బుమ్రా తనదైన శైలిలో నిలువరించాడు.

సంక్షిప్త స్కోర్లు

భారత్ తొలి ఇన్నింగ్స్: 185 ఆలౌట్(పంత్ 40, జడేజా 26, బోలాండ్ 4-31, స్టార్క్ 3-49), **ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్:** 9-1(కాన్‌స్టాస్ 7 నాటౌట్, ఖవాజ 2, బుమ్రా 1-7)

నాయర్ నయా రికార్డు

- లిస్ట్ 'ఏ' క్రికెట్‌లో అద్భుత ప్రదర్శన

విజయనగరం: విదర్భ స్టార్ క్రికెటర్ కరణ్ నాయర్(101 బంతుల్లో 112, 11ఫోర్లు, 2సిక్స్‌లు) సూపర్ సెంచరీతో సరికొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. ఔట్ కాకుండా అత్యధిక పరుగులు(542) పరుగులు చేసిన తొలి బ్యాటర్‌గా నాయర్ నయా ఫీట్ నెలకొల్పాడు. దీంతో న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ జేమ్స్ ఫ్రాంక్లిన్(527) నెలకొల్పిన రికార్డును నాయర్ తాజాగా తుడిచిపెట్టాడు. విజయ్ హజారే వన్డే టోర్నీలో శుక్రవారం ఉత్తరప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో సెంచరీ ద్వారా ఈ స్టార్ బ్యాటర్ ఘనత అందుకున్నాడు. నాయర్‌తో పాటు యశ్ రాథోడ్(138) సెంచరీ చేయడంతో విదర్భ 8 వికెట్ల తేడాతో యూపీపై గెలిచింది. అయితే తొలుత యూపీ 50 ఓవర్లలో 307-8 స్కోరు చేసింది. సమీర్ రిజ్వి(105), మాధవ్ కౌశిక్(41), ప్రియమ్ గార్గ్(34), శివమ్ మావి(33 నాటౌట్) రాణించారు.

హైదరాబాద్‌కు మూడో ఓటమి

అహ్మదాబాద్: విజయ్ హజారే టోర్నీలో హైదరాబాద్ ఒడిదొడుకుల పయనం కొనసాగుతున్నది. శుక్రవారం జరిగిన గ్రూపు-సీ మ్యాచ్‌లో హైదరాబాద్ 80 పరుగుల తేడాతో పంజాబ్ చేతిలో ఓటమిపాలైంది. తొలుత పంజాబ్ నిర్ణీత 50 ఓవర్లలో 426-4 భారీ స్కోరు చేసింది. ప్రభ్‌సిమ్రన్ సింగ్(137), అభిషేక్‌శర్మ(93), రమణ్‌దీప్‌సింగ్(80) దుమ్మురేపడంతో పంజాబ్ పరుగుల వరద పారించింది. ముదాసిర్, నిశాంత్, అనికేత్, తనయ్ ఒక్కో వికెట్ తీశారు. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ 47.5 ఓవర్లలో 346 పరుగులకు ఆలౌటైంది. నితీశ్‌రెడ్డి(111), తనయ్ త్యాగరాజన్(74) రాణించినా లాభం లేకపోయింది. అర్ష్‌దీప్‌సింగ్(4), రఘుశర్మ(3) విజృంభించారు. ఇప్పటి వరకు ఆడిన 6 మ్యాచ్‌ల్లో హైదరాబాద్ మూడింటిలో గెలిచి, మూడు ఓడింది.

టీబీఏ అధ్యక్షుడిగా శ్రీధర్‌బాబు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్(టీబీఏ) నూతన అధ్యక్షుడిగా మంత్రి శ్రీధర్ బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని భారత బ్యాడ్మింటన్ అసోసియేషన్(బీఏఐ) ఉపాధ్యక్షుడు పుల్లెల గోపీచంద్ శుక్రవారం అధికారిక ప్రకటనలో పేర్కొన్నారు.

చిత్రం

త్రివిక్రమ్ తర్వాత ఆ దర్శకుడితో..

'పుష్ప-2'తో బాక్సాఫీస్ రికార్డులన్నింటినీ చెడుగుడు ఆడేశాడు బన్నీ. త్రివిక్రమ్‌తో చేయబోయే ఆయన నెక్ట్స్ సినిమాపై అంచనాలు భారీ స్థాయిలో ఉన్నాయి. ఈ ఏడాది మిడిల్‌లో ఈ సినిమా మొదలు కానున్నదని చిత్ర నిర్మాత సూర్యదేవర నాగవంశీ ప్రకటించారు. ఇదిలావుంటే.. ఈ సినిమా తర్వాత మరో సినిమాను కూడా ఓకే చేసే పనిలో ఉన్నారు అల్లు అర్జున్. ఇటీవలే దర్శకుడు కొరటాల శివ.. బన్నీని కలిసి ఓ కథ వినిపించారని విశ్వసనీయ సమాచారం. త్రివిక్రమ్‌తో చేయబోయే సినిమా వచ్చే ఏడాది చివర్లో విడుదల అంటున్నారు. ఇక కొరటాలకు 'దేవర-2' ఉండనే ఉంది. ఈ రెండు సినిమాలు పూర్తవ్వగానే ఈ నయా ప్రాజెక్ట్ పట్టాలెక్కుతుందని సమాచారం. మరి బన్నీ కోసం కొరటాల ఎలాంటి కథను తయారు చేశారో, ఈ సినిమా నిర్మించేదెవరో.. తదితర విషయాలు తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే.

సంక్రాంతి కలిసొచ్చింది!

'పోలీస్ క్యారెక్టర్‌లో నటించాలన్నది నా డ్రీమ్. ఎప్పటి నుంచో అవకాశం కోసం ఎదురుచూస్తున్నా. కెరీర్ ఆరంభంలోనే ఇలాంటి పాత్ర లభించడం ఆనందంగా ఉంది' అని చెప్పింది మీనాక్షి చౌదరి. అనతికాలంలోనే తెలుగు అగ్ర కథానాయికల్లో ఒకరిగా గుర్తింపు తెచ్చుకున్న ఈ భామ నటించిన తాజా చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. వెంకటేష్ కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో దిల్ రాజు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకొస్తున్నది. ఈ సందర్భంగా శుక్రవారం మీనాక్షి చౌదరి పాత్రికేయులతో మాట్లాడింది. తాను ఇప్పటివరకు కామెడీ జోనర్ సినిమా చేయలేదని, తొలిసారి ఈ తరహా పాత్రలో నటించడం కొత్త అనుభూతినిచ్చిందని తెలిపింది. ఇందులో తాను యాక్షన్ సీక్వెన్స్ కూడా చేశానని, ఆ ఎపిసోడ్స్‌ను ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తారని చెప్పింది. 'పోలీస్ పాత్ర కోసం ఎలాంటి రిఫరెన్స్ తీసుకోలేదు. మా నాన్న ఆర్మీ ఆఫీసర్ కాబట్టి వారి బాడీ లాంగ్వేజ్, మేనరిజమ్స్ మీద అవగాహన ఉంది. నేను కూడా లేడీ పోలీసుల తాలూకు కొన్ని విషయాలను సేకరించాను' అని చెప్పింది. వెంకటేష్ వంటి సీనియర్ నటుడితో కలిసి నటించడం ఆనందంగా ఉందని, ఆయన ఎప్పుడూ ప్రశాంతగా కనిపిస్తారని, కామెడీ టైమింగ్ అద్భుతంగా ఉంటుందని మీనాక్షి చౌదరి పేర్కొంది. గత ఏడాది సంక్రాంతికి 'గుంటూరు కారం'తో ప్రేక్షకుల్ని పలకరించానని, ఈ ఏడాది 'సంక్రాంతికి వస్తున్నాం'లో భాగమయ్యానని, ఈ పండగ తనకు కలిసొచ్చిందని ఆనందం వ్యక్తం చేసింది. ప్రస్తుతం నవీన్ పొలిశెట్టితో ఓ సినిమా చేస్తున్నానని, మరో రెండు చిత్రాలను త్వరలో ప్రకటిస్తానని మీనాక్షి చౌదరి తెలిపింది.

ఎన్టీఆర్‌తో ఎన్టీఆర్ వార్?

ఎన్టీఆర్ ప్రస్తుతం బాలీవుడ్‌లో 'వార్ 2' చేస్తున్న విషయం తెలిసిందే. హృతిక్ రోషన్‌తో కలిసి ఆయన నటిస్తున్న ఈ చిత్రాన్ని అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో యష్‌రాజ్ ఫిల్మ్స్ నిర్మిస్తున్నది. ఇదిలావుంటే.. ఈ సినిమాపై బీటౌన్‌లో ఆసక్తికరమైన ఓ వార్త చక్కర్లు కొడుతున్నది. వివరాల్లోకెళ్తే.. ఈ సినిమాలో తారక్ ద్విపాత్రాభినయం చేస్తున్నారట. ఎన్టీఆర్ రెండు పాత్రలూ ఒకదానితో ఒకటి పోరాడతాయని తెలుస్తున్నది. ఈ కథలో ఇదే హైలైట్ అని సమాచారం. కథ రీత్యా ఇందులో హృతిక్ కంటే ఎన్టీఆర్‌కే ఎక్కువ ప్రాధాన్యత ఉంటుందని బాలీవుడ్ కోడై కూస్తున్నది. అయితే.. బాలీవుడ్ సంస్థ నిర్మిస్తున్న ఈ సినిమాలో తమ హీరోని తక్కువ చేసుకోవడం జరిగే పనికాదని, అలాగని తెలుగు రాష్ట్రాల్లో తారక్ వల్ల వచ్చే భారీ బిజినెస్‌ని కూడా తక్కువ అంచనా వేయకూడదని బాలీవుడ్ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ఇందులో నిజానిజాలు తెలియాలంటే ఈ ఏడాది ఆగస్ట్ 14 దాకా ఆగాల్సిందే.

బెల్లంకొండ యాక్షన్ అడ్వెంచర్

బెల్లంకొండ సాయిశ్రీనివాస్ కథానాయకుడిగా రూపొందుతోన్న డివైన్, యాక్షన్ అడ్వెంచర్ 'బీఎస్ఎస్ 12'(వర్కింగ్ టైటిల్). సుధీర్ రెడ్డి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. మహేష్ చందు నిర్మాత. శుక్రవారం బెల్లంకొండ సాయిశ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమాలో ఆయన పాత్రకు సంబంధించిన పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో రెండుకాళ్లు సీటుపై పెట్టి ధైర్యంగా బైక్ నడుపుతూ అడ్వెంచర్ అవతార్‌లో బెల్లంకొండ సాయి కనిపిస్తున్నారు. అతని వెనుక ఒక కొండ.. ఆ కొండపై రగులుతున్న విష్ణు నామాలు చూడొచ్చు. 400ఏళ్ల నాటి దశావతార ఆలయం నేపథ్యంలో సాగే యాక్షన్ అడ్వెంచర్ మూవీ ఇదని, బెల్లంకొండ సాయి కెరీర్‌లోనే హయ్యెస్ట్ బడ్జెట్‌తో ఈ సినిమా రూపొందుతున్నదని, 35శాతం షూటింగ్ పూర్తయిందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: శివేంద్ర, సంగీతం: లియోన్ జేమ్స్, నిర్మాణం: మూన్‌షైన్ పిక్చర్స్.

మైథలాజికల్ పాయింట్‌తో 'బార్బరిక్'

దర్శకుడు మారుతి సమర్పకుడిగా మోహన్ శ్రీవత్స దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'బార్బరిక్'. సత్యరాజ్, వశిష్ట ఎన్ సింహ, సాంచి రాయ్, ఉదయభాను ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. వానర సెల్యూలాయిడ్ పతాకంపై విజయ్‌పాల్ రెడ్డి అడిదల నిర్మిస్తున్నారు. శుక్రవారం టీజర్‌ను విడుదల చేశారు. 'స్వీయ నాశనానికి మూడు ద్వారాలున్నాయి. ఇది నువ్వో నేనో చేసే పని కాదు. దిమాక్ ఉన్నోడే చేయాలి. ఒకడు తాచుపాము తోకని తొక్కాడు. వాడ్ని పాము కాటేయబోతోంది. మరి తొక్కించిన వాడి సంగతేంటి? అనే డైలాగ్‌తో టీజర్ ఆసక్తికరంగా సాగింది. మారుతి మాట్లాడుతూ 'మైథాలజికల్ పాత్ర నేటి ప్రపంచంలోకి వస్తే ఎలా ఉంటుందో అనే అంశం ప్రధానంగా ఈ సినిమాను తెరకెక్కించారు. సరికొత్త పాయింట్‌తో ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుంది' అన్నారు. ఈ సినిమా టైటిల్, గ్లింప్స్‌కు అద్భుతమైన స్పందన వచ్చిందని, డిఫరెంట్ కాన్సెప్ట్‌తో తెరకెక్కించామని దర్శకుడు తెలిపారు. తన కెరీర్‌లో ఇదొక వైవిధ్యమైన చిత్రమని సత్యరాజ్ పేర్కొన్నారు. ఈ చిత్రానికి ఇన్స్పిరేషన్ బ్యాండ్ సంగీతాన్నందిస్తున్నది.

సినీ దర్శకురాలు అపర్ణ మల్లాది కన్నుమూత

సినీ దర్శకురాలు అపర్ణ మల్లాది (54) శుక్రవారం కన్నుమూశారు. గత కొంతకాలంగా ఆమె క్యాన్సర్‌తో బాధపడుతోంది. అమెరికాలో చికిత్స తీసుకుంటూ అక్కడే మృతి చెందారు. 'ది అనుశ్రీ ఎక్స్‌పెరిమెంట్స్' అనే చిత్రంతో అపర్ణ మల్లాది దర్శకురాలిగా పరిచయమయ్యారు. 'పోష్ పోరీస్' వెబ్‌సిరీస్ ఆమెకు మంచి పేరు తెచ్చి పెట్టింది. రెండేళ్ల క్రితం 'పెళ్లి కూతురు పార్టీ' అనే చిత్రానికి దర్శకత్వం వహించారు. కొన్ని చిత్రాలకు కథలను అందించడంతో పాటు నిర్మాతగా కూడా వ్యవహరించారు. అపర్ణ మల్లాది మృతిపట్ల పలువురు సినీ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

రైజ్ ఆఫ్ ది డ్రాగన్

'లవ్ టుడే' ఫేమ్ ప్రదీప్ రంగనాథన్ హీరోగా నటిస్తున్న చిత్రం 'రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్'. ఆశ్వత్ మారిముత్తు దర్శకుడు. ఈ సినిమా నుంచి 'రైజ్ ఆఫ్ ది డ్రాగన్' అనే పాటను శుక్రవారం విడుదల చేశారు. లియోన్ జేమ్స్ స్వరపరచిన ఈ పాటను రామజోగయ్య శాస్త్రి రచించారు. ఇందులో ప్రదీప్ రంగనాథన్‌తో కలిసి ప్రముఖ దర్శకుడు గౌతమ్ మీనన్ స్టెప్పులేశారు. 'యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ ఇది. వినోదంతో పాటు చక్కటి భావోద్వేగాలతో సాగుతుంది. అంతర్లీనంగా సందేశం ఉంటుంది. 'లవ్‌టుడే' తరహాలోనే యువతను మెప్పిస్తుంది' అని మేకర్స్ తెలిపారు. అనుపమ పరమేశ్వరన్, కె.ఎస్.రవికుమార్, మిస్కిన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రాన్ని ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ నిర్మిస్తున్నది.

జానర్ అడక్కండి.. మాక్కూడా తెలియదు..

విశ్వదేవ్ రాచకొండ, బిందుమాధవి ప్రధాన పాత్రధారులుగా ఓ చిత్రం తెరకెక్కుతున్నది. స్పిరిట్ మీడియా, వాల్టెయిర్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి శశాంక్ శ్రీవాస్తవయ దర్శకుడు. రానా దగ్గుబాటి సమర్పణలో రూపొందుతోన్న ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను శుక్రవారం మేకర్స్ విడుదల చేశారు. విశ్వదేవ్ రాచకొండ, బిందుమాధవి ఈ లుక్‌లో అల్ట్రా మోడరన్‌గా ఆకట్టుకున్నారు. పోస్టర్‌పై 'జానర్ అడగొద్దు.. మాక్కూడా తెలీదు' అనే క్యాప్షన్ కథపై ఆసక్తిని పెంచుతున్నది. వైవిధ్యమైన కథ, కథనాలతో ఈ సినిమా రూపొందుతున్నదని మేకర్స్ తెలిపారు. త్వరలో విడుదల కానున్న ఈ సినిమాకు సంగీతం: వివేక్ సాగర్, సౌండ్ మిక్స్: అజిత్ అబ్రహం జార్జ్.

ఎటెళ్లాలో అర్థంకాక..?

కథానాయిక రుక్మిణి వసంత్‌కు సంబంధించిన ఆసక్తికరమైన వార్త ఒకటి శాండిల్‌వుడ్‌లో బాగా హల్‌చల్ చేస్తున్నది. వివరాల్లో కెళ్తే.. ఈ ముద్దుగుమ్మ ఇటీవలే ఎన్టీఆర్-ప్రశాంత్‌నీల్ సినిమాకు సంబంధించిన అగ్రిమెంట్‌లో సంతకం చేసింది. తమ సినిమా పూర్తయ్యేంతవరకు మరో సినిమా చేయకూడదని ఒప్పందం సారాంశం. ఇదిలావుంటే.. దీనికంటే ముందే 'కాంతార-2'కు కూడా సైన్ చేసింది. ఈ సినిమా అయ్యేంతవరకూ మరో సినిమా చేయకూడదని రిషబ్‌శెట్టి ఒప్పందం. దానిక్కూడా ఓకే అనేసి, అడ్వాన్స్ అందుకుంది. ఈ రెండు సినిమాలకే కాక, చిన్నాచితకా సినిమాలక్కూడా ఓకే చెప్పిందట. ఈ సినిమాలన్నీ ఈ ఏడాదే షూటింగ్స్ జరుపుకోనున్నాయి. దాంతో తీసుకున్న డబ్బుల్ని వె